మినుము రైతు కంట కన్నీరు

- వర్షాలకు 50శాతం దెబ్బతిన్న పంట
- ధర ఉన్నా దిగుబడులు కొరత
- పెట్టుబడి ఖర్చులు కూడా వచ్చేలా లేవంటున్న రైతులు



కొల్లూరు కరకట్ట దిగువున మినుము కోతలు చేస్తున్న వ్యవసాయ కూలీలు

కొల్లూరు: కృష్ణానదికి కనీవినీ ఎరుగని రీతిలో సెప్టెంబర్‌లో వరదలు సంభవించాయి. వరదల ప్రభావం జిల్లాలోని కొల్లూరు, బాపట్ల, రేపల్లె మండలాల పరిధిలోని 22 లంక గ్రామాలపై పడింది. సుమారు 12 వేల ఎకరాలలో వాణిజ్య పంటలు పూర్తిగా దెబ్బతినడంతో రూ. వందల కోట్లలో రైతులు నష్టాలపాలయ్యారు. వాణిజ్య పంటల ఫలసాయం పొంది లాభాలు గడించవచ్చునన్న రైతుల ఆశలు అడియాశలవడంతో అప్పోసొప్పో చేసి ప్రత్యామ్నాయ పంటగా లంక గ్రామాలలో మినుము సాగుకు రైతాంగం మొగ్గు చూపింది. రబీలో మొక్కజొన్న సాగు చేపట్టే సమయానికి మినుము చేతికందితే, వరదలు మిగిల్చిన నష్టంలో కొంతైన పూడుతుందన్న భావనలో ఉన్న రైతులను అపరిమితంగా కురిసిన వర్షాలు కోలుకోకుండా చేశాయి. పంట భూముల్లో విత్తనాలు వేసిన దగ్గర నుంచి ఎడాపెడా కురిసిన వానల కారణంగా మినుము పంట దెబ్బతిని దిగుబడులు సగానికి సగం తగ్గిపోవడం రైతాంగానికి గొడ్డలిపెట్టులా మారింది. మినుము సాగు ఆదుకుంటుందన్న ఆశాభావంలో ఉన్న రైతులకు వర్షాలు మింగుడు పడకుండా చేయడంతో కర్షకులు అప్పుల ఊబిలోనే కొట్టుమిట్టాడుతున్నారు.

ధర ఉన్నా ప్రయోజనం సున్నా..

సుమారు 1500 ఎకరాల వరకు రైతులు మినుము సాగు చేపట్టారు. రైతులు విత్తనం వేసిన దగ్గర నుంచి తెగుళ్లు, పురుగు మందులతో కలుపుకొని, నూర్పిడి వరకు ఎకరాకు రూ.20వేల వరకు పెట్టుబడులు వెచ్చించి పంట పండించారు. అయితే పంట చేతికందిన ప్రస్తుత తరుణంలో ఎకరాకు 8 నుంచి 9 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందనుకున్న రైతాంగానికి 5 క్వింటాళ్లకు మించి దిగుబడులు లభించకపోవడం ప్రతికూలంగా మారింది. ప్రస్తుతం క్వింటా మినుము ధర రూ.8 వేల నుంచి రూ. 8,100 వరకు రైతుల వద్ద కొనుగోళ్లు జరుగుతున్నాయి. ప్రస్తుతం ధర లభిస్తున్నా దిగుబడులు మందగించడంతో రైతు కష్టానికి తగిన ఫలితం లేకుండా పోయింది.

ఎంతో వ్యయం చేశాం..



మినప పంట తెగుళ్ల బారిన పడకుండా సంరక్షించుకునేందుకు పురుగుమందులకు ఎక్కువ వ్యయం చేయాల్సి వచ్చింది. మరో వైపు వర్షాల కారణంగా పంటకు వాటిల్లిన నష్టంతో దిగుబడులు తగ్గిపోయాయి. ఎకరాకు నాగులు బస్తాలకు మించి దిగుబడులు వచ్చే సూచనలు కనిపించడం లేదు.

– కనపర్తి జయపాల్, ఆవులవారిపాలెం శివారు, క్రీస్తులంక, కొల్లూరు మండలం

వర్షాలు కోలుకోనివ్వలేదు..



వరదలకు ముందు సాగుచేసిన పసుపు పంట ఎందుకు పనికిరాకుండా పోవడంతో ప్రత్యామ్నాయంగా సాగుచేసిన మినుముపై ఆశలు పెట్టుకున్నాం. అయితే నిరంతరం కురిసిన వర్షాలు మినుము పండించిన రైతులను కోలుకోకుండా చేశాయి. ఎకరాకు 5 క్వింటాళ్లకు మించి దిగుబడి లేకపోవడంతో కష్టానికి ప్రతిఫలం దక్కకుండా పోయింది.

– సనక రాధాకృష్ణ, గాజుల్లంక, కొల్లూరు మండలం

ఘనంగా పంచ మండపాల పూజ

భట్టిప్రోలు: స్వామియే శరణమయ్యప్ప నామ స్మరణతో శనివారం భట్టిప్రోలు మారుమోగింది. ఈ సందర్భంగా బండారు పార్థసారధి-సరస్వతి దంపతులు పంచముఖ మండపాల అయ్యప్ప స్వామి పడిపూజా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గురుస్వామి అక్కల హరి ఆధ్వర్యంలో స్వామివారికి 18 రకాల అభిషేకాలు శాస్త్రోక్తంగా జరిపారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప, శివ స్వాములు, భవానీలు, గ్రామ ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

క్లుప్తంగా

అసాంఘిక కార్యకలాపాలను పోలీసుల దృష్టికి తేవాలి

రేపల్లె డీఎస్పీ ఎ.శ్రీనివాసరావు

కొల్లూరు: అసాంఘిక కార్యకలాపాల విషయంలో ప్రజలు చైతన్యవంతంగా వ్యవహరించి ఎప్పటికప్పుడు పోలీసుల దృష్టికి తీసుకురావాలని రేపల్లె డీఎస్పీ ఎ.శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం రాత్రి మండలంలోని కిష్కిందపాలెంలో ఆయన పల్లెనిద్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామంలో ఇటీవల పాఠశాల విద్యార్థినులతో ఉపాధ్యాయుడు వ్యవహరించిన తీరు బాధాకరమన్నారు. బాధిత విద్యార్థినులు అధైర్యపడకుండా ముందుకు సాగాలని సూచించారు. ప్రజలు చట్టాలను తమ చేతుల్లోకి తీసుకొని వ్యవహరించకుండా తాము ఎదుర్కొంటున్న సమస్యలను పోలీసుల దృష్టికి తీసుకువస్తే తగిన న్యాయం చేయడానికి కృషి చేస్తామన్నారు. వేమూరు సీఐ పీవీ ఆంజనేయులు, కొల్లూరు ఎస్ఐ జి.ఏడుకొండలు, సర్పంచి గుంటూరు నీలాంబరం పాల్గొన్నారు.

వేడుకగా దత్త జయంతి ఉత్సవాలు



బాపట్ల: శంకర విద్యాలయంలో దత్తాత్రేయ స్వామి వారి జయంతి ఉత్సవాలను భక్తులు భక్తిశ్రద్ధలతో శనివారం నిర్వహించారు. ఉదయం గోపూజ, మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సహస్ర నామార్చన, మంత్రపుష్పం చేపట్టారు. మధ్యాహ్నం స్వామివారికి లక్ష బిల్వార్చన, అనంతరం108వ వార్షికోత్సవ సభలో శ్రీ వెంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం ఉపకులపతి రాణి సదాశివమూర్తి ముఖ్య అతిథిగా పాల్గొని సంస్కృత భాష ప్రాముఖ్యతను వివరించారు. వేద విద్యాభ్యాసము, హోమాలు చేయుట వలన కాలుష్య ప్రభావాన్ని నివారించవచ్చుని తెలిపారు. మరొక అతిథిగా నిష్ఠల సుబ్రహ్మణ్య శాస్త్రి గురు శిష్యుల సంబంధాన్ని వివరించారు. అనంతరం విద్యార్థులకు వేద విద్యలో రాణించిన వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అధ్యాపకులకు, విద్యార్థులకు వస్త్రాలు అందించారు. డాక్టర్ పులిపాక వెంకట కృష్ణయ్య, శంకర విద్యాలయ సంఘ సభ్యులు గోపాల కృష్ణమూర్తి, చలపతిరావు, భుజగేంద్ర మౌళి, బాబు నాగేంద్ర, బిజీ, సత్యప్రసాద్, శ్రీనివాస శర్మ, అధ్యాపకులు అగ్నిహోత్ర అవధాని, గణేష్ శర్మ, విద్యార్థులు, భక్తులు పాల్గొన్నారు.

పెసర్లంక హైస్కూల్‌కు రోటరీ ఆపన్నహస్తం

వరదలకు దెబ్బతిన్న పాఠశాలకు రూ.3 లక్షలు విరాళం



పెసర్లంక(భట్టిప్రోలు): గత సెప్టెంబర్‌లో కృష్ణా నదికి సంభవించిన వరదల నేపథ్యంలో భట్టిప్రోలు మండలం పెసర్లంక దేవభక్తుని కోటయ్య జిల్లా పరిషత్ హైస్కూల్ జల దిగ్బంధంలో చిక్కుకుని కనీవిని ఎరుగని రీతిలో నష్టం వాటిల్లింది. ఈ సందర్భంగా హైస్కూల్‌లోని సైన్స్ ల్యాబ్ పరికరాలు, క్రీడా దుస్తులు, గోడలపై మ్యాప్‌లు, మాథ్స్ కిట్స్, కుర్చీలు, మైక్ సెట్లు, ప్రింటర్, కంప్యూటర్, స్కానర్, బీరువాలు, టేబుళ్లు, కుర్చీలు, తదితర వస్తువులు పాడైపోయాయి. విషయాన్ని హెచ్ఎం ఎస్‌కె మహబూబ్ బాషా ద్వారా తెలుసుకున్న పొన్నూరు రోటరీ క్లబ్ రూ.3 లక్షలు విరాళంగా ప్రకటించింది. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ బృందం శనివారం హై స్కూల్‌ను సందర్శించింది. క్లబ్ నిర్వాహకులకు పాఠశాలలో అభినందన సభ ఏర్పాటు చేశారు. సంధానకర్తగా ఎన్.బాలకృష్ణ వ్యవహరించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కె.శరత్‌చంద్ర చౌదరి మాట్లాడుతూ పిల్లలు సేవా దృక్పథంను అలవరచుకోవాలని కోరారు. హైస్కూల్ పురోభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు ఉంటాయని చెప్పారు. పొన్నూరు క్లబ్ ప్రెసిడెంట్ డాక్టర్ రవి రాకేష్, సర్వీస్ సొసైటీ ప్రెసిడెంట్ బి.రామారావు, అసిస్టెంట్ గవర్నర్ మలినేని పెరుమాళ్లు, డెప్యూటీ గవర్నర్ పాటిబండ్ల శివరంజని, క్లబ్ సెక్రటరీ నన్నపనేని బాలకృష్ణ, సభ్యులు, ఎంఈఓ నీలం దేవరాజు, పెసర్లంక, పెదలంక సర్పంచులు వేములపల్లి వెంకటేశ్వరరావు, వేములపల్లి శ్రీ రంజని, ఎస్ఎంసీ చైర్మన్‌లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవం



ఎంపీ రాజుపాలెంలో నామినేషన్ పత్రాలను పరిశీలిస్తున్న ఆర్డీఓ గ్లోరియా

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలంలో నీటి సంఘాల ఎన్నికలు శనివారం ప్రశాంతంగా జరిగాయి. పెదపులివర్రు, సూరేపల్లి, భట్టిప్రోలు నీటి సంఘాల ఎన్నికలలో టెరిటోరియల్ కానిస్టెన్సీస్ (టీసీ)లకు 36 మంది ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయా గ్రామాల్లోని హైస్కూళ్లల్లోని ఎన్నికల కేంద్రాలను తహసీల్దార్ మేకా శ్రీనివాసరావు పరిశీలించారు. ఉదయం 8 గంటల నుంచి ఆయా ఎన్నికల పోలింగ్ కేంద్రాల్లో ఒక్కో సంఘానికి సంబంధించి ఎన్నిక జరిగింది. ఒక్కో సంఘానికి సంబంధించి అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పెదపులివర్రు నీటి సంఘం అధ్యక్షుడిగా గుత్తా రవీంద్రబాబు, ఉపాధ్యక్షుడిగా కోడూరు వెంకటాద్రి, భట్టిప్రోలు: యర్రంశెట్టి కరుణ శ్రీనివాసరావు, డొక్కు శ్రీనివాసరావు, సూరేపల్లి: వాకా పాపారావు, షేక్ ఇబ్రహీమ్ ఖలీల్‌లను ఎన్నుకున్నారు. వీరికి ఆయా కేంద్రాల ఎన్నికల అధికారులు ధ్రువీకరణ పత్రాలను అందించేశారు. సహాయ అధికారి, పీఓ, ఏపీఓలు ఎన్నికలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికలు జరిగే భట్టిప్రోలు టీఎం రావు, సూరేపల్లి వీపీ అండ్ జీఎస్ఎం, పెదపులివర్రు జెడ్పీ హైస్కూల్స్‌ను తహసీల్దార్ సందర్శించారు. ఆయన వెంట ఆర్ఐ ఫణికుమార్, వీఆర్వోలు, సిబ్బంది ఉన్నారు.

చుండూరులో...

చుండూరు(వేమూరు): చుండూరు మండలంలో ఆరు నీటి సంఘాలకు ఎన్నికలు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించారు. పెదగాదెలవర్రు నీటి సంఘం అధ్యక్షుడిగా కె.శరత్, మండూరు కె.శ్రీనివాసరరావు, యడ్లపల్లి టి.శివరెడ్డి, మోదుకూరు -1 జి.గోపి, మోదుకూరు-2, టి.రాఘవరెడ్డి, వేటపాలెం కె.శ్రీనివాసరావులు ఎన్నికైనట్లు తహసీల్దార్ నాగరాజు తెలిపారు.

కొల్లూరులో...

కొల్లూరు: నీటి సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలు మండలంలో శనివారం జరిగాయి. మండలంలోని 5 నీటి సంఘాలకు టీసీల ఎన్నికల అనంతరం అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకున్నారు. అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా అనంతవరం నీటి సంఘానికి నాగళ్ల రత్నబాబు, బొల్లిముంత వెంకటేశ్వరరావు, రావికంపాడు నీటి సంఘానికి కాసరనేని మోహన్ రావు, బొందలపాటి రామ్మోహన్‌రావు, కొల్లూరు నీటి సంఘానికి యలవర్తి కోటేశ్వరరావు, తాడేపల్లి శ్రీనివాసరావు, దోనేపూడి నీటి సంఘానికి వెనిగళ్ల నీలాకృష్ణమూర్తి, ఆరేపల్లి సుధాకరరావు, ఈపూరు నీటి సంఘానికి మల్లంపాటి హరిబాబు, తలశిల బోస్‌లు ఎంపికైనట్లు ఆయా ఎన్నికల నిర్వహణాధికారులు తెలిపారు.

కర్లపాలెంలో...

కర్లపాలెం: మండల పరిధిలో నీటి సంఘాలకు శనివారం ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. ఎన్నికలను ఆర్డీఓ గ్లోరియా, తహసీల్దార్ సుందరమ్మ పరిశీలించారు. ఇరిగేషన్ అధికారులు తెలిపిన వివరాల మేరకు 334 గణపవరం నీటి సంఘం అధ్యక్షుడిగా పులుగు పానకాలరెడ్డి, 335 కర్లపాలెం -1 దొప్పలపూడి రాజశేఖర్, 336 కర్లపాలెం-2 పెనుమత్స రంగరాజు, 337 పేరలి-1 బోయిన వెంకటస్వామి, 338 పేరలి-2 అధ్యక్షుడిగా మల్లారపు శ్రీనివాసరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని తెలిపారు.

పిట్టలవానిపాలెంలో...

పిట్టలవానిపాలెం మండల పరిధిలోని నాలుగు నీటి సంఘాలకు ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. 301 అల్లూరు నీటి సంఘంకు అధ్యక్షుడిగా బేతాళం అచ్యుతరామరాజు, 299 ఖాజీపాలెం రుద్రరాజు సత్యనారాయణరాజు, 298 చందోలు-1 జాలాది అశోక్, 311 చందోలు-2 నీటి సంఘానికి అధ్యక్షుడిగా ఇస్మాయిల్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని తెలిపారు.

రేపల్లెలో..

రేపల్లె రూరల్: రేపల్లె మండలంలో సాగునీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. మండలంలోని 9 నీటి సంఘాలకు జరిగిన ఎన్నికలు ప్రశాంతంగా ముగిసినట్లు తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. పోలింగ్ కేంద్రాలను ఆయన శనివారం పరిశీలించి మాట్లాడారు. కారుమూరు సంఘ అధ్యక్షుడుగా గ్రంథి మల్లికార్జునరావు, ఉపాధ్యక్షుడుగా పరుచూరి రాఘవ, పేటేరు: డొక్కు నారయ్య, వాకా మధు, రేపల్లె: యరగళ్ళ శ్రీనివాసరావు, వేపూరి శివసుబ్రహ్మణ్యం, నల్లూరు: పంతాని మురళీధరరావు, మైనేని లక్ష్మీనారాయణ, నల్లూరుపాలెం: సబ్బినేని శ్రీనివాసరావు, యలవర్తి శ్రీనివాసరావు, మోర్తోట: రేపల్లె బసవపున్నయ్య, కొల్లి కృష్ణమూర్తి, పిరాట్లంక: బర్మా వీరరాఘవయ్య, షేక్ సర్దార్, తుమ్మల సంఘం: జొన్నా నరసయ్య, ఐ.జనేష్, రాజుకాల్వ సంఘ అధ్యక్షుడిగా తలశిల శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా యేమినేని వెంకటేశ్వరరావులతో పాటు ఆయా సంఘాలకు 12 మంది సభ్యులను ఎన్నుకోవటం జరిగిందన్నారు.

అమర్తలూరులో...

మూల్పూరు(వేమూరు): సాగు నీటి సంఘాలు అధ్యక్షుల ఎంపిక శనివారం నిర్వహించినట్లు తహసీల్దారు నెహ్రూ తెలిపారు. విజేతల వివరాలు ఆయన వెల్లడించారు. కూచిపూడి నీటి సంఘం అధ్యక్షుడిగా యలవర్తి రఘుబాబు, అమృతలూరు: గోవాడ రామాంజనీయులు, గోవాడ: కావూరు సత్యనారాయణ, ఇంటూరు: బోరుగడ్డ సామియేలు, మోపర్రు: అల్ల శ్రీనివాసరావు, ప్యాపర్రు: కొరటాల లీలా సత్యసాయిలను ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేద్దాం



పార్టీ కూచిపూడి గ్రామ అధ్యక్షుడిగా ఎన్నికైన మునిపల్లి శ్యామ్‌తో అశోక్‌బాబు

పార్టీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు

అమర్తలూరు(వేమూరు): వైఎస్సార్ సీపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పార్టీ వేమూరు నియోజక వర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు అన్నారు. అమర్తలూరు మండలంలోని కూచిపూడి, యడవూరు గ్రామాల్లో పార్టీ కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కూచిపూడి గ్రామ అధ్యక్షుడిగా మునిపల్లి శ్యామ్ బాబును, యడవూరు అధ్యక్షుడుగా కరేటి భాస్కరరావులను ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కష్టసమయాల్లోనూ అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు అందించారన్నారు. రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయానికి అందరు కష్టపడి పనిచేయాలని ఆయన సూచించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామని గద్దెనెక్కి తీరా ఇప్పుడు వాటి అమలును పక్కనబెట్టి ప్రజలను నిలువునా మోసం చేశారన్నారు. పార్టీ నాయకులు ఎస్.దత్తు, కొండముాద గౌమంత్, శివపార్వతి, రాఘురామయ్య, కరేటి శివనాగరాజు, మైలా వెంకట్రావు, కుర్రా గోపాల్, తొలిసూరి శ్రీనివాసరావు, అడ్డంగి శ్రీనివాసరావు, కనగాల శ్రీనివాసరావు, ఆలపాటి సుబ్బారావు, దున్నా అభిలాష్, సిద్దెల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌లో సత్వర న్యాయం

- సీనియర్ సివిల్ జడ్జి టి.వెంకటేశ్వర్లు
- జాతీయ లోక్ అదాలత్‌లో 185 కేసులకు పరిష్కారం



జాతీయ లోక్ అదాలత్‌లో విచారణ చేస్తున్న సీనియర్ సివిల్ జడ్జి టి.వెంకటేశ్వర్లు

రేపల్లె రూరల్: లోక్ అదాలత్‌లో కక్షిదారులకు సత్వర న్యాయం చేకూరుతుందని సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు టి.వెంకటేశ్వర్లు అన్నారు. పట్టణంలోని సబ్‌కోర్టు హాలులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. రాజీ పడదగిన కేసులను లోక్‌అదాలత్‌లో పరిశీలించి సత్వరమే న్యాయం చేయటం జరుగుతుందన్నారు. దీంతో కక్షిదారులకు సమయం, ఆదాయం వృథా కావన్నారు. ఈ సందర్భంగా 6 సివిల్ కేసులు, 178 క్రిమినల్ కేసులు, 1 ప్రీలిటిగేషన్ కేసులను పరిష్కరించారు. కక్షిదారులకు రూ.33లక్షల ఆదాయం సమకూరినట్లు పేర్కొన్నారు. అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జీ రూపశ్రీ, న్యాయవాదులు డీఎస్ హరికుమార్, మోర్ల శివరాం, తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

రేపల్లె రూరల్: టీటీడీ శ్రీవాణి ట్రస్ట్ ఆర్థిక సహాయంతో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పోటుమెరక జలార్తమ్మ ఎస్టీ కాలనీలో నిర్మాణమైన వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం స్వామివారికి సామూహిక అష్టోత్తర శతనామ పూజలు నిర్వహించి సత్సంగ కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా బాపట్ల జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు మాట్లాడుతూ మార్గశిర మాసంలో వచ్చే ధనుర్మాసం చాలా ముఖ్యమైనదని వివరించారు. సంక్రాంతి వరకు సాంప్రదాయాలను పాటిస్తూ దైవరాధన చేయాలని సూచించారు. ధనుర్మాస వ్రత విధానాన్ని వివరించారు. భక్తులు పూజా కార్యక్రమాలలో అధిక సంఖ్యలో పాల్గొని మొక్కుబడులు తీర్చుకున్నారు.

మాకినేని బసవపున్నయ్యకు ఘననివాళి

భట్టిప్రోలు: పీడిత ప్రజల విముక్తి కోసం కామ్రేడ్ మాకినేని బసవపున్నయ్య నిరంతరం కృషిచేశారని సీపీఎం భట్టిప్రోలు మండల కమిటీ నాయకుడు ఎం.సత్యన్నారాయణ పేర్కొన్నారు. దివంగత సీపీఎం నాయకులు బసవపున్నయ్య 111వ జయంతి పురస్కరించుకుని శనివారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. సత్యన్నారాయణ మాట్లాడుతూ బసవపున్నయ్య మార్క్సిజాన్ని మన దేశ, కాల పరిస్థితులకు అన్వయించి పార్టీకి దిశానిర్దేశం చేశారన్నారు. సీపీఎం నాయకులు ఎ.శ్రీనివాసరావు, జి.నాగరాజు, బి.నాగమల్లేశ్వరరావు, ఎస్.గోపాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ అభివృద్ధిపై శ్రద్ధ వహించాలి

ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అప్పలరాజు



డిపో ఆవరణలో మొక్క నాటుతున్న ఆర్టీసీ ఈడీ అప్పలరాజు

రేపల్లె రూరల్: ఆర్టీసీ అభివృద్ధికి ఆర్టీసీ కార్మికులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎ.అప్పలరాజు అన్నారు. రేపల్లె ఏపీఎస్ ఆర్టీసీ డిపోను శనివారం ఆయన సందర్శించి అనంతరం మాట్లాడారు. ఆర్టీసీ బస్సులను ప్రయాణికులు అధిక సంఖ్యలో వినియోగించుకునేలా సిబ్బంది పనిచేయాలన్నారు. ప్రయాణికులను సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేర్చాలని పేర్కొన్నారు. సమయపాలన పాటిస్తూ క్రమశిక్షణగా మెలుగుతూ విధులు నిర్వర్తించాలని చెప్పారు. డ్రైవర్‌లు, కండక్టర్‌లు బస్సును పికప్ పాయింట్ల వద్ద ప్రయాణికులను తప్పనిసరిగా ఎక్కించుకొని వారిని సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలని చెప్పారు. డిపోలో విధులు నిర్వర్తించే కార్మికులు బస్సుల కండీషన్‌లను నిరంతరం పరిశీలిస్తూ ఉండాలన్నారు. బస్సులో ఏదైనా లోపం తలెత్తితే వెంటనే సరిచేయాలని, కండీషన్ బాగుందేవిధంగా పనిచేయాలని తెలిపారు. అనంతరం డిపో కార్యాలయ ఆవరణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. గుంటూరు డీపీటీఓ అధికారి ఎం.రవికాంత్, డిపోమేనేర్ ఎ.రాజశేఖర్, సిస్టం సూపర్‌వైజర్ ఎస్‌డీ బాజీ, ఏఎంఎఫ్ సమతారాణి, డిపోలోని పలు అసోసియేషన్‌ల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.